epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 53 | గురువారం | 13.06.2024









# జోరుగా బడిబాట

## పండగలా ప్రారంభమైన స్కూళ్లు

## సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవాన్ని పండగలా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కేంద్రంలో జరిగిన ప్రోగ్రామ్‌లో కలెక్టర్ పాల్గొనగా.. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ చాగల్లులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యతో పాటు అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. - మన చౌరాస్తా, నెట్ వర్క్

2లో..




బాల కార్మిక చట్టాలపై

### అవగాహన

బాల కార్మిక చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప అన్నారు. బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

3లో



వాగుపై బ్రిడ్జి కోసం

### వినతి...

చిటకోడూర్, చౌడారం, మరిగడి తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వాగు మీద బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

3లో

General News



# సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతాం..
- విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మకాంచ పరిధిలో గల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం బడి బాట కార్యక్రమాన్ని పండగలా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులు, పీఎం శ్రీ కింద, మన ఊరు మన బడి కింద మిగిలి ఉన్న మరమ్మతుల పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు ఇప్పటికే వంద శాతంగా పాఠశాలలకు చేరాయని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరు కావాలని, ఉపాధ్యాయులు చెప్పే బోధన పాఠాలను శ్రద్ధగా వినాలని, చక్కగా చదువుకోవాలని సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి, కమిటీ సభ్యులుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటారని, వారు పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలు, శానిటేషన్, తాగునీరు, హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల మార్కులను బాధ్యతాయుతంగా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అదే విధంగా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఫలితాల్లో జనగామ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అత్యధికంగా పాస్ అయ్యారని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని సూచించారు. ప్రతి నెల మూడవ శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. పాఠశాలలకు అడ్మిన్ ఫండ్ కింద నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించడానికి ప్రభుత్వ బడులు తోడ్పాటునందిస్తాయని తెలిపారు. మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున మాట్లాడుతూ 1970లో తాను ఇదే జెడ్పీహెచ్ఎస్ లో చదివి, నేడు ఈ స్థానంలో ఉన్నందుకు గర్వపడుతున్నానని తెలిపారు. విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదవాలని సూచించారు. ఏది సాధించాలన్నా చదువే ముఖ్యమని తెలిపారు. అనంతరం 9.8 జీపీఏ సాధించిన హర్షిత అనే విద్యార్థినిని కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఖోఖోలో పతకం సాధించిన విద్యార్థి సాత్విక్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రాము, జీసీడీవో గౌసియా బేగం, వార్డు కౌన్సిలర్ చంద్రకళ, ఎంపీడీవో సంపత్ కుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య**

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడి బాట స్వాగత దినోత్సవం కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. కడియం మాట్లాడుతూ... బడి ఈడూ పిల్లలందరిని బడి బాట పట్టించాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని.. పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే విద్యా కమిషన్ ఏర్పాటు చేసి.. విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలోనే



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రూపొందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, సీడీపీవో ఫ్లోరెన్స్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏసీపీ భీమ్ శర్మ, ఏఎంఓ శ్రీని వాస్, ఎమ్మార్వో వెంకటేష్, జడ్పీటీసీ మారపాక రవి పాల్గొన్నారు.



# పాఠ్యపుస్తకాల పంపణీ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ భావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు, తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. బుధవారం మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పోచన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీఎం నాగేశ్వరరావు, ఎంపీటీసీ అరుణ, సీసీ తిరుమల, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం గిరీశ్ పాల్గొన్నారు.




# ఉచిత పుస్తకాలు.. నాణ్యమైన విద్య

**పాలకుర్తి, మన చౌరాస్తా:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకుర్తి మండల ప్రత్యేక అధికారి మొగులప్ప అన్నారు. జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం శోభారాణి అధ్యక్షత వహించగా మొగిలప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ,యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు.తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలోనే చదివించాలని,ప్రభుత్వ బడిలో చదివిన వారు ఎంతోమంది ఉన్నత స్థాయిలో ఉన్నారని, ఎఎపిసి ల ద్వారా 30 పాఠశాలల్లో పాలకుర్తి మండలంలో వసతులు కల్పిస్తున్నద ప్రభుత్వమని, పాఠశాలలన్నీ చాలా అందంగా తీర్చిదిద్దబడినాయని, తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశం, ఎంపిడిఓ రాములు, సిఎంఓ నరసింహారావు, ఎంఎన్ఓ పోతుగంటి నర్సయ్య, ఎఎపిసి చైర్ పర్సన్ గ్రామ ప్రత్యేక అధికారి జయంతి, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రమేష్, నాగయ్య, నరసింహమూర్తి, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.



**జనగామ పట్టణంలోని హరిజనకాలనీ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న కౌన్సిలర్ గాదెపాక రాంచందర్, హెచ్ఎం నిర్మాల రాములు**

Local News




# బాల కార్మికుల చట్టంపై అవగాహన

**జనగామ, మన చౌరాస్తా :** బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మికుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప ముఖ్య అతిథితా పాల్గొని మాట్లాడారు. బాల కార్మికుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం అక్కడ ఉన్న పిల్లలతో కొద్ది సేపు మాట్లాడారు. అందరూ బడికి వెళ్తున్నారా..? పాఠశాలలో పాఠాలు చెబుతున్నారా..? బడిలో భోజనం పెడుతున్నారా..? అని ఆరాతీశారు. కార్యక్రమానికి లేబర్ ఆఫీసర్ కుమారస్వామి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోత్స్న, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీహరి, పీఎల్వీ దీప్తి పాల్గొన్నారు.

# సిద్దేశ్వర ఆలయంలో వేలం పాట

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సిద్దేశ్వర ఆలయంలో వేలం పాటలు ద్వారా ఆదాయం రూ.14,40,116 వచ్చాయి. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్దేశ్వర ఆలయంలో బుధవారం ఆలయ ఈవో వంశీ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఓబుల్ కేశవాపూర్ గ్రామానికి చెందిన బి.పవన్ కొబ్బరికాయలు, పూజా సామాగ్రిని వేలం పాటతో రూ.13,05,116 లకు దక్కించు కోగా, అలాగే బచ్చన్నపేట మండలం కోడవటూరు గ్రామానికి చెందిన పి.అమరేశ్వర్ కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు రూ.1,35,000లకు వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ భువనగిరి డివిజన్ పరిశీలకులు బి.సుగుణ, ప్రధాన అర్చకులు ఓం నమశివాయ, జూనియర్ అసిస్టెంట్లు రాజేందర్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మధు, భానుప్రకాష్ రెడ్డి, మహాశివుడు, సదాశివుడు, ఓంకారేశ్వర్, నందీశ్వర్, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

## విద్యార్థుల భవిష్యత్తుతో

# ఆటలు ఆడితే ఊరుకోం

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభి గౌడ్



**జనగామ, మన చౌరాస్తా :** ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఊరుకోమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభి గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో వైష్ణవి స్కూల్ యజమానులు శ్రీ చైతన్య అనే పేరుతో మూడేళ్లుగా విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సరైన అనుమతులు లేని ఈ పాఠశాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పాఠశాలపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.



# వాగుపై బ్రిడ్జి కోసం వినతి

**జనగామ, మన చౌరాస్తా :** చిటకోడూర్, చౌడారం, మరిగడి తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న వాగు మీద బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ మాట్లాడుతూ గత ఏడాది కురిసిన వానలకు వాగుపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయిందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, యశ్వంతాపూర్ ఎంపీటీసీ మెరుగు బాలరాజు గౌడ్, మరిగడి ఎంపీటీసీ సలేంద్రి మహేశ్వరి శ్రీనివాస్, చిక్కుడు వెంకటేష్, చిరంజీవి, ముక్క వెంకటయ్య, జెరిపోతుల రాజయ్య, ఓరుగంటి నర్సింహులు, రావుల రాజు, మన్నె కార్తీక్, నాగారపు శివగణేష్, మిద్దెపాక పరశురాములు, పసుల రమేష్, యాసారపు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన, ఎరువుల

# దుకాణాల తనిఖీ

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల పరిధిలో గల ఎస్ఎస్ అగ్రి మాల్, పటేల్ గూడెం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల విక్రయాలు, రైతుల కొనుగోలు వివరాల రిజిస్టర్లను చెక్ చేశారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే కల్తీ విత్తనాలు, ఎరువులను అమ్మరాదని, బ్లాక్ లోనూ ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయాలు చేయరాదని సూచించారు. అనంతరం స్థానిక (పటేల్ గూడెం) గ్రామంలో మిషన్ భగీరథ యాప్ కు సంబంధించిన ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వేను పర్యవేక్షించారు. ఆయన వెంట డీఏఓ వినోద్ కుమార్, తహసీల్దార్ వినయ లత, ఎంపీఓ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.



# దేవర.. వాయిదా ?

మన చౌరాస్తా, సినిమా : ఏప్రిల్ 10 నుంచి దేవర వాయిదా పడినపుడు తారక్ ఫ్యాన్స్ బాగా హర్ట్ అయ్యారు. అయితే నేం అక్టోబర్‌లో వస్తానంటున్నాడుగా అంటూ సరిపెట్టుకున్నారు. కానీ ఇప్పడు దేవర గురించి మరో షాకింగ్ న్యూస్ వినేలా ఉన్నారు అభిమానులు. చెప్పిన తేదీ కాకుండా మరో తేదీపై కొరటాల అండ్ టీం కన్నేస్తున్నట్లు కనిపిస్తుంది. అసలు దేవర చుట్టూ ఏం జరుగుతుందో ఎక్స్‌క్లూజివ్‌గా చూద్దాం..

జూనియర్ ఎన్టీఆర్ దేవర సినిమా షూటింగ్ ఊహించిన దానికంటే వేగంగా జరుగుతుంది. గోవాలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు కొరటాల శివ. జులైలోపే ఈ చిత్ర షూటింగ్ పూర్తి కానుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగానే జరుగుతున్నాయి. అంతా బాగానే ఉంది కదా.. మరి రిలీజ్ డేట్‌లో మార్పేంటి అనుకోవచ్చు. ఇక్కడే ఉంది అసలు ట్విస్ట్.

రిలీజ్ డేట్ మార్పు అంటే కేవలం పోస్ట్ పోన్ మాత్రమే కాదు.. ప్రీ పోన్ కూడా. దేవర విషయంలో దర్శక నిర్మాతలు ఆలోచించేది కూడా ఇదే. చెప్పిన తేదీ కంటే 2 వారాలు ముందే దేవరను విడుదల చేయాలని చూస్తున్నారు మేకర్స్. అంటే సెప్టెంబర్ 27న అన్నమాట. ఎందుకంటే ఆ రోజు రావాల్సిన పవన్ కళ్యాణ్ ఓజి రావట్లేదు కాబట్టి..!

ఓజి షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉంది. ఒకవేళ పవన్ కళ్యాణ్ వచ్చి డేట్స్ ఇచ్చి.. ఆ సినిమాను వేగంగా పూర్తి చేసినా.. ఓటిటి సంస్థల దగ్గర స్లాట్స్ ఖాళీగా లేవు కాబట్టి 2025లోనే ఓజి విడుదల చేయాల్సిన పరిస్థితి. ఈ విషయం నిర్మాతలకు తెలిసే రిలీజ్ డేట్ వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు పవన్ ఖాళీ చేసిన సెప్టెంబర్ 27పై తారక్ ఫోకస్ చేస్తున్నారు. దేవర పూర్తయ్యే వరకు వార్ 2 వైపు వెళ్లకూడదని ఫిక్సయ్యారు తారక్. ఆగస్ట్‌లోపే ఫస్ట్ కాపీ కూడా రెడీ అయిపోతుంది కాబట్టి.. అక్టోబర్ 10 వరకు వేచి చూడాల్సిన పనిలేదు. అందుకే రెండు వారాలు ముందే తీసుకొస్తున్నారు ఈ సినిమాను.